# సింగిల్ పేజీ కథలు

## జీవితమే ఓ చదరంగం

వడివడిగా దాదాపు పరుగెడుతోన్నట్లుగా నడుస్తోంది రంగి. దాని మనను మనసులో లేదు. పనిలో నుంచి సాయంత్రం ఇల్లు చేరేసరికి చంటిది మూసిన కన్ను తెరవకుండా పడుకునుంది. మధ్యాహ్నం నుంచీ ఇలాగే ఉందని చెప్పింది రంగి మామ్మ. తను పనిచేసే ఇంటి అమ్మగారిని డబ్బు అడిగి చంటిదాన్ని డాక్టరు దగ్గరకు తీసుకెళ్ళాలని అనుకుని అమ్మగారింటి వైపు వెళుతోంది. ఆలోచన్లు సాగుతూనే ఉన్నాయి.

కొత్తకోడలుగారు మొన్నే వచ్చారు. పెళ్ళయి సంవత్సరం పైనే అయినా ఇన్నాళ్ళూ అమ్మగారు పుట్టింట్లోనే ఉన్నారు. చదువుకుంటున్నది పరీక్షలు అయాక తీసుకొస్తాం అని పెద్దమ్మగారు అందరికీ చెప్తుంటారు. పెద్దోళ్ళు అలాగే చెప్తారు కట్నకానుకల్లో గొడవలొచ్చి ఇన్నాళ్ళూ కోడలిని తీసుకురాలేదు అని అమ్మలక్కలు అనుకోగా వింది.

కోడలమ్మగారు కుందనం బొమ్మలాగా ఉంటారు. ఇంత ఆస్తులు, మేడలు ఉన్నోళ్ళు కూడా పరోళ్ళ సొమ్ము కట్నం కోసం ఎందుకు ఆశపడతారో అనుకుంది.

ఇంతలో ఇల్లు రాగానే తన ఆలోచనలకు బ్రేక్ వేసి మెయిన్ గేటు తీసుకుని లోనికి వెళ్ళింది. అయ్యగార్లు ఇద్దరూ వచ్చేసినట్లున్నారు. స్కూటర్లు రెండూ ఉన్నాయి. అనుకుంటూనే వేసి ఉన్న హాలు యొక్క తలుపు తీయబోతూ 'షాక్' కొట్టినట్లుగా ఆగిపోయింది.

అప్పుడే లోపలి నుంచి 'చంపు', 'చంపు' అని గట్టిగా పెద్దమ్మగారి గొంతు విని, ఈసారి కొయ్యబారి పోయింది భయంతో. "చంపెయ్యరా ఇంకా ఆలోచిస్తావేం" అంటున్నారు అయ్యగారు. రంగికి అంతా అయోమయంగా అనిపించింది.

మెరుపులా ఆలోచన మెరిసి వెంటనే అలర్టయ్యింది. అయితే కోడలుగారిని చంపేస్తున్నారన్నమాట. టి.వి.లో చూడటం పేపర్లలో చదవడమే కానీ ఇలాంటివి ఇప్పుడే చూస్తోంది. ఎంత మంచి మనుష్యుల్లా ఉంటారు. పైకి ఉమ్మో వీళ్ళింత రాక్షసులా? నమ్మలేకపోతోంది. ఎలా? ఏదైనా చెయ్యాలి చిన్నమ్మగారిని రక్షించాలి అనుకుని చాలా స్పీడ్‌గా ఆలోచించి ఇంటి ప్రక్కకు పరుగెత్తి బెడ్‌రూం కిటికీలు తీయడానికి ట్రై చేసింది. రాలేదు. మళ్ళీ ఇంటి వెనక్కి పరుగెత్తి వెళ్ళి నిచ్చెన తెచ్చుకుని బెడ్‌రూం వెంటిలేటర్ దగ్గరకు ఎక్కి అందులోంచి చూడ్డానికి ట్రై చేసింది. కానీ కనిపించలేదు. కిటికీలన్నీ బిగించి ఉన్నాయి.

ఈసారి మళ్ళీ చిన్నమ్మగారు కెవ్వుమన్న కేక వినిపించింది.

మళ్ళీ 'చంపెయ్, చంపెయ్' అన్న అరుపులు వినిపించాయి.ఇక క్షణం ఆలస్యం చెయ్యకుండా ఇంటి వెనక్కి పరుగెత్తికెళ్ళి వంటగది తలుపులు తోసింది.



రాలేదు.

వంటమనిషిని కూడా పంపించేసి ఉంటారు. వంటగది కిటికీలు బలంగా తోసింది అవీ రాలేదు. ఆ ప్రక్కకు వెళ్ళి బెడ్ రూం కిటికీలు, అన్ని గదుల కిటికీలు బలంగా తోస్తూ వెళ్ళింది. ఆఖరికి డైనింగ్ హాలుకి ఉన్న కిటికీ ఒకటి వచ్చింది. అందులోంచి పెద్ద హాలు కనిపిస్తోంది.

అక్కడ కనిపించిన దృశ్యం చూసి ఆశ్చర్యంతో నోరు తెరుచుకుని ఉండిపోయింది రంగి.అక్కడ- పెద్దయ్యగారు, పెద్దమ్మగారు సోఫాలో కూర్చుని ఉన్నారు. ఒక కుర్చీలో చిన్నయ్యగారు, ఎదురుగా ఉన్న కుర్చీలో చిన్నమ్మగారు కూర్చుని ఉన్నారు. మధ్యలో టీపాయ్ వుంది. అందరూ టీపాయ్ పైకి వంగి దీక్షగా చూస్తున్నారు. టీపాయ్ పై నలుపు, తెలుపుల బొమ్మలేవో వున్నాయి. అదేదో ఆడుతున్నారని మాత్రం అర్థం అయింది రంగికి.

ఎప్పుడూ వాటిని చూడకపోవడం వలన ఇంతపార్ధానికి దారి తీసింది.

కళ్ళు విప్పార్చుకుని, నోరు తెరుచుకుని అలా ఎంత సేపుందో పాపం రతి.

ఇప్పటికే మీకు అర్థం అయ్యే ఉంటుంది కదండీ! వాళ్ళంత ఆసక్తిగా ఆడేది 'చెస్' అని, 'చదరంగ'మని.

-పి.అమరజ్యోతి
(అనకాపల్లి)

★ ★ ★

## కాంప్లిమెంట్

"ఆమె పేరు నాకు తెలియదు. కానీ మంచుబిందువులకి తడిసిన తెల్లగులాబిలా, అయిదున్నరడుగుల మంచి ముత్యానికి బట్ట కట్టినట్టూ, కోలగా ఉన్న చందమామకి నేరేడు పళ్ల లాంటి కళ్ళు, సంపెంగ లాంటి ముక్కు, ఎర్రటి గులాబిరేకుల్లాంటి తీరైన పెదవులూ, అజంతా శిల్ప ఆకృతికి జీవం పోసినట్టూ, అందానికే అందంలా ఉంటుందిరా నా హృదయ చోరురాలు" అని అవినాష్ మరలా ఏదో చెప్పబోయేంతలో.

"చాలు, చాలు. గంట నుంచీ ఇలాగే నీ భాషాపరిజ్ఞానంతో నా చెవుల్లో కందిరీగలా పోరి, కుమ్మరి పురుగులా తొలిచి, నా కర్ణభేరి పొరని చించేస్తున్నావ్. నీకు నా మీద ఏ మూలైనా జాలి, దయా మిగులుంటే నన్నొదిలేసి ఆ కాఫీ రెస్టారెంట్‌లో చూసిన అమ్మాయితోనే ఐ లవ్ యు అని చెప్పి తగలడు" చిరాకు పడ్డాడు సుధాకర్.

"చెప్పొచ్చు. కానీ ఆమె ఎలా రియాక్ట్ అవుతుందో"? శూన్యంలోకి చూస్తూ సందేహం వెలిబుచ్చాడు మధు.

"అలా అని చెప్పకుండా నువ్విలా కాలయాపన చేస్తే, ఈ లోపు ఆ అమ్మాయికి వేరెవరైనా ప్రపోజ్ చెయ్యొచ్చు. లేదా ఆమెకి పెళ్లి కుదరొచ్చు, అదీ కాదంటే ఆ అమ్మాయే నీకు కనబడకుండా పోవచ్చు. అప్పుడు నువ్వు నా దగ్గరకొచ్చి గుక్కపట్టి ఏడ్చినా, నన్ను దుఃఖపెట్టి చంపినా ఆ అమ్మాయి జాడ కాదు కదా కనీసం ఆమె జడ కూడా దొరకదు" చెప్పాడు సుధాకర్.

"అంటే నువ్విప్పుడు అనేదేంటి!" స్వరం పెంచాడు అవినాష్.

"ఏముంది! ఈ రోజే నీ మనసులోని మాట ఆమెకి చెప్పి తాడో పేడో ఆ అమ్మాయితో నీ ప్రేమ పండుతుందో, పుచ్చుతుందో ఈరోజే, నేడే, టుడే, ఆ డే తెల్సుకో. ఇదే నీ బెస్ట్ ఫ్రెండ్‌గా నేనిచ్చే సలహా" చెప్పాడు సుధాకర్ ఉత్సాహంగా అవినాష్ భుజం తడుతూ.